సాక్షి కామారెడ్డి

మంగళవారం ǀ 14 ǀ జనవరి ǀ 2025



గోదారంగనాథుల కల్యాణం

జిల్లాలోని పలు ప్రాంతాలలో సోమవారం గోదా రంగనాథుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

- 9లో ▸



అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాల విషయంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.7 /14.3

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

'దివ్య మానవ నిర్మాణ విధి' ఆవిష్కరణ



కామారెడ్డి అర్బన్: నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధనపాల్ సూర్యనారాయణ, రాకేష్‌రెడ్డి ఆదివారం రాత్రి పాతరాజంపేటలోని ఆర్ష గురుకులాన్ని(బ్రహ్మ మహా విద్యాలయం) సందర్శించారు. ఆశ్రమ నిర్వాహకులు బ్రహ్మానంద సరస్వతి స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్వామీజీ రాసిన 'దివ్య మానవ నిర్మాణ విధి' ముందుమాటను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హర్యానాకు చెందిన ఆశిష్ ఆచార్య, పండిత్ విదేహ్ మహరాజ్, ఆచార్య సోమశేఖర్, పండిత్ హరిదాస్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసి నాయక్‌పోడ్' కార్యవర్గం ఎన్నిక



గాంధారి : చెన్నాపూర్‌లో సోమవారం ఆదివాసి నాయక్‌పోడ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిర్నపల్లి సాయిలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా మొట్ట పెంటయ్య, ఉపాధ్యక్షుడిగా కంది సాయిలు, కార్యదర్శిగా పుట్ట వెంకట్, కోశాధికారిగా సాయిబాబా, కార్య నిర్వాహక కార్యదర్శిగా ముత్యా సంజీవు ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

'రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి'



కామారెడ్డి అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలని ప్రభుత్వ అధ్యాపకుల సంఘం(359) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలం నర్సింలు, టి.రమేశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై సోమవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌లను కలసి వినతి పత్రం అందించామని పేర్కొన్నారు. కామారెడ్డిలో ఇంటర్మీడియట్ పరీక్షల స్పాట్ వాల్యూవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరామన్నారు.

అర్చరీ క్రీడాకారులకు సన్మానం



దోమకొండ: దోమకొండకు చెందిన అర్చరీ క్రీడాకారులు కదిరె సింధూజ, ఎం అనుదీప్‌లను సోమవారం అర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌గౌడ్ సన్మానించారు. సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలలో సింధూజ, రాజస్తాన్‌లో జరిగిన సబ్ జూనియర్ నేషనల్ పోటీలలో అనుదీప్ కాంస్య పతకాలు సాధించారు. దీంతో సోమవారం గడికోటలో జరిగిన కార్యక్రమంలో వారిని సన్మానించారు. కార్యక్రమంలో అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్, అర్చరీ సంఘం జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి, పీడీ నరసింహారెడ్డి, నాయకులు పున్న లక్ష్మణ్, రాంచంద్రం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ జోన్ ఎత్తివేయాలని నిరశన దీక్ష

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌లో ఇండస్ట్రియల్ జోన్ ఎత్తివేయాలని మాస్టర్ ప్లాన్ బాధితుడు అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం రాత్రి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మాస్టర్ ప్లాన్‌లో ఇండస్ట్రియల్, గ్రీన్ జోన్లను ఎత్తివేస్తామని రేవంత్ రెడ్డి చెప్పారని, అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా దానిని అమలు చేయడం లేదని పేర్కొన్నారు. తక్షణమే జోన్లను ఎత్తివేయాలన్నారు. అప్పటి వరకు నిరాహార దీక్ష కొనసాగిస్తానని పేర్కొన్నారు.

పల్లె గూటికి పండుగొచ్చింది





పల్లెగూటికి పండుగొచ్చింది. బతుకుదెరువు కోసమో, ఉన్నత చదువుల కోసమో ఊరు విడిచి పట్నం బాట పట్టినవారు.. సంక్రాంతి పండుగ కోసం సొంతూళ్లకు చేరుకున్నారు. దీంతో ఏ వాకిలి చూసినా రంగురంగుల ముగ్గులే దర్శనమిస్తున్నాయి. ఇళ్లలోంచి పిండివంటల ఘుమఘుమలు వస్తున్నాయి. నింగిని తాకేందుకు పోటీపడుతున్న పతంగులతో పల్లెలు సందడిగా మారాయి.

బాన్సువాడలో పిండి వంటలు చేస్తున్న కుటుంబం

- పిల్లాపాపలతో సొంతూళ్లకు చేరిన జనం
- వాకిళ్ల నిండా రంగురంగుల ముగ్గులు
- వంటింట్లో పిండివంటల ఘుమఘుమలు
- సందడిగా మారిన గ్రామసీమలు
- నేడు సంక్రాంతి పండుగ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఈ ఏడాది వానాకాలంలో భారీ వర్షాలు కురియడంతో పంటలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. యాసంగి సీజన్‌కు సంబంధించి వరి నాట్లు ముమ్మరంగా నడుస్తున్నాయి. దీంతో సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. రెండు మూడు రోజులుగా పండుగ ఏర్పాట్లలో మునిగిపోయారు. సోమవారం భోగి పండుగ చేసుకున్న ప్రజలు.. మంగళవారం సంక్రాంతిని ఆనందంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. బుధవారం కనుమ పండుగ జరుపుకోనున్నారు.

భువిపై విరిసిన హరివిల్లులు..

పల్లె, పట్నం తేడా లేదు.. అంతటా వాకిళ్ల నిండా రంగురంగుల ముగ్గులు పరుచుకుంటున్నాయి. ఏ ఇంటికి వెళ్లినా రంగురంగుల ముగ్గులు స్వాగతం పలుకుతున్నాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆడవాళ్లంతా పోటీపడి ముగ్గులు వేస్తున్నారు. సోమవారం భోగి పండగ సందర్భంగా భోగిమంటలు వేశారు. బీర్కూర్ మండలంలోని రైతునగర్‌లో మూడు రోజుల వేడుకలు ఘనంగా మొదలయ్యాయి. విదేశాల్లో ఉన్న వారు పలువురు సొంతూరుకు చేరుకున్నారు.

విందుల కోసం ఏర్పాట్లు...

సంక్రాంతి పండుగ సందర్భంగా ఇళ్లలో విందుల కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే చాలా మంది మేకలు, గొర్రెలు కోయడానికి సిద్ధమయ్యారు. కొన్ని కుటుంబాలు కలిసి ఓ మేకను కోసుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. మరికొందరు కోళ్లు కోసి పండుగలు చేసుకుంటారు. పండుగ సందర్భంగా విందు, వినోదాలతో ఆనందంగా గడపడానికి ప్రతి ఒక్కరు సిద్ధమయ్యారు.

ఏ ఇంట చూసినా పిండివంటలే..

సంక్రాంతి పండుగ అంటేనే ముగ్గులతోపాటు పిండివంటలు గుర్తుకొస్తాయి. పేద, ధనిక తేడా లేకుండా అన్ని వర్గాల వారు రకరకాల పిండివంటలు తయారు చేస్తున్నారు. రెండు మూడు రోజులుగా ఏ వీధికి వెళ్లినా పిండివంటల ఘుమఘుమలు వస్తున్నాయి. అరిసెలు, చకినాలు, గారెలు, చెగోడీలు, మొడీలు తదితర పిండివంటలు చేసుకుంటున్నారు.



భోగిమంటలు వేస్తున్న రైతునగర్‌వాసులు

దూడూ బసవన్న..

బీబీపేట: సంక్రాంతి పండుగ అంటే ఇంటిముందు రంగవల్లులు.. ఇళ్లలో పిండివంటలు.. హరిదాసుల కీర్తనలు.. విందులు,వినోదాలు.. నింగి చేరేందుకు ప్రయత్నించే పతంగులే కాదు.. గంగిరెద్దుల విన్యాసాలూ ఉంటాయి. గంగిరెద్దులను ఆడించేవారు వాటిని తీసుకుని ఇంటింటికి వెళ్తారు. ఇళ్ల యజమానులు ఇచ్చేది స్వీకరించి, ఆశీర్వదిస్తుంటారు. సోమవారం బీబీపేటలో ఓ బాలుడు బసవన్నతో సందడి చేశాడు.



రైతునగర్‌కు సంక్రాంతి శోభ..

బాన్సువాడ: బీర్కూర్ మండలంలోని రైతునగర్‌లో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకుంటారు. దేశ, విదేశాల్లో ఉన్న వారు సైతం పండుగ సందర్భంగా సొంతూళ్లకు వస్తారు. గ్రామస్తులంతా కలిసి జన్మభూమి ట్రస్ట్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ ట్రస్ట్ ద్వారా ఏటా సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామస్తులంతా ఒక్క చోటకు చేరి పండుగ జరుపుకుంటారు. మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. యువకులకు క్రికెట్, చిన్నారులు, మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు.

మార్కెట్లకు పండుగ కళ



కామారెడ్డి పట్టణంలో పండుగ సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

కామారెడ్డి టౌన్: సంక్రాంతికి అవసరమైన సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. పిండి వంటలకు అవసరమైన సామగ్రితోపాటు ముగ్గులు వేయడానికి రంగులు, నోములకోసం ప్రత్యేక సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. పిల్లలు, యువత గాలిపటాలను కొంటున్నారు. పండుగ సందర్భంగా జిల్లాకేంద్రంలోని సుభాష్‌రోడ్, జేపీఎన్‌రోడ్, మాయాబజార్ తదితర ప్రాంతాలలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశారు. కొనుగోలుదారులతో ఆయా ప్రాంతాలు రద్దీగా మారాయి.



రైతునగర్‌లో..



రైతునగర్‌లో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు



రంగవల్లులను పరిశీలిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి



విజేతకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే

వివాదాల నడుమ నిష్క్రమణ

- ఐదేళ్లలో ఎన్నో ఆరోపణలు
- జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బాధ్యతల నుంచి ప్రతిమారాజ్ తొలగింపు



ప్రతిమారాజ్



శ్రీనివాస్

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ప్రతిమారాజ్ కొనసాగిన సమయంలో అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా జీజీహెచ్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సైతం సమీక్ష సమావేశంలో మండిపడ్డారు. ఈ క్రమంలో ఇటీవల ఫిట్స్‌తో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చిన మహిళను సిబ్బంది పట్టించుకోని తీరు వివాదాస్పదంగా మారింది. ఆస్పత్రి సిబ్బంది రోగికి స్కానింగ్ చేయకుండా, ప్రైవేట్‌కు వెళ్లమని సూచించారు. చివరికి ఆస్పత్రి నుంచి గెంటి వేయడంతో మహిళా రోగితో పాటు ఆమె భర్త, పిల్లలు సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకు ఆస్పత్రి ప్రధాన గేట్ బయట చలిలో గడిపారు. ఆస్పత్రిలో ఇలా రోగులు ఇబ్బంది పడుతుండగా.. మరోవైపు సూపరింటెండెంట్ తన చాంబర్‌లో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడంపై విమర్శలు వచ్చాయి. ఆస్పత్రిలో రోగులు ఇబ్బందులకు గురవుతున్న తీరు.. సిబ్బంది పట్టింపులేనితనంపై మంత్రి రాజనర్సింహతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ప్రతిమారాజ్‌ను ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బాధ్యతల నుంచి రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టీనా జెడ్ చోంగ్తూ ఆదేశాలతో డీహెచ్ తొలగించారు. ప్రతిమారాజ్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణకు ఆదేశించారు.

డాక్టర్ శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు..

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా మెడికల్ కళాశాల ప్రొఫెసర్, చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ పి.శ్రీనివాస్‌ను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. డాక్టర్ శ్రీనివాస్ రెండున్నరేళ్లుగా ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

'స్త్రీ శక్తిని చాటిన అహిల్యాబాయి హోల్కర్'

కామారెడ్డి అర్బన్ : దివంగత మహారాణి అహిల్యాబాయి హోల్కర్ స్త్రీ శక్తికి ప్రతీక అని సామాజిక సమరసతా వేదిక ప్రముఖ్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. అహిల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం సమరసత వేదిక ఆధ్వర్యంలో కామారెడ్డి దేవి విహార్‌లో ముగ్గుల పోటీ, క్విజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ అహిల్యాబాయ్ హోల్కర్ ఇండోర్ కేంద్రంగా పరిపాలన సాగించారన్నారు. ఆమె ఎన్నో గొప్ప సంస్కరణలు చేపట్టి చరిత్రలో నిలిచారన్నారు. యుద్ధ విద్యలలో స్త్రీలను ప్రోత్సహించి మహిళా సేనను ఏర్పాటు చేశారన్నారు. ఆమె జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం ఆయా పోటీలలో గెలుపొందినవారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక జిల్లా మహిళా కన్వీనర్ రవళి, కోకన్వీనర్లు సుష్మ, హేమలత, గౌరవ అధ్యక్షులు తుమ్మ రామచంద్ర, జిల్లా అధ్యక్షులు అమృత రాజేందర్, విభాగ్ సహ సంయోజక్ బాలరాజు గౌడ్, ప్రతినిధులు భూపాల్, దత్తు రావు, కృష్ణమూర్తి, రాజేందర్, ప్రశాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



క్విజ్, ముగ్గుల పోటీల విజేతలతో సామాజిక సమరసత వేదిక ప్రతినిధులు

పట్టుబట్టి పసుపు బోర్డు

- ఇందూరుకు పసుపు బోర్డు తీసుకొచ్చిన నిజామాబాద్ ఎంపీ అర్వింద్
- బోర్డు చైర్మన్‌గా బీజేపీ సీనియర్ నేత పల్లె గంగారెడ్డి
- నేడు నిజామాబాద్ స్పైసెస్ బోర్డులో తాత్కాలిక కార్యాలయాన్ని వర్చువల్‌గా ప్రారంభించనున్న కేంద్ర మంత్రి గోయల్
- ఇందూరుకు రానున్న జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి హేమలత



ఎంపీ అర్వింద్, పల్లె గంగారెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పసుపు బోర్డు సాధిస్తాననే హామీ, నినాదంతో ఇందూరు రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఎంపీ ధర్మపురి అర్వింద్ పట్టువదలని విక్రమార్కుడిలా ఒక్కో అడుగు ముందుకేస్తూ లక్ష్యాన్ని సాధించారు. తెలంగాణలో పసుపు బోర్డుకు ప్రధాని మోదీతో ప్రకటన చేయించిన అనంతరం ఇందూరులోనే ఏర్పాటు చేసేవరకు పట్టు వదలకుండా ముందుకెళ్లారు. 2024 ఏప్రిల్ 19న మొదటిసారి 'సాక్షి' దినపత్రిక 'ఇందూరులోనే పసుపు బోర్డు' కథనం ప్రచురించింది. అదే విధంగా పసుపు బోర్డును మహారాష్ట్రకు తరలించుకుపోయేందుకు మహారాష్ట్రకు చెందిన కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, నితిన్ గడ్కరీలు ప్రయత్నాలు చేసినప్పుడు ఢిల్లీలో ఎంపీ అర్వింద్ మంత్రాంగం చేసిన విషయమై 2024 డిసెంబర్ 3న 'సాక్షి'లో 'పసుపు బోర్డు కోసం' కథనం ప్రచురితమైంది. తాజాగా సంక్రాంతి కానుకగా ఎంపీ అర్వింద్ ఏకంగా జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా జిల్లాకు చెందిన సీనియర్ నేత పల్లె గంగారెడ్డిని నియమించేలా చక్రం తిప్పారు. మంగళవారం ఇందూరులోని స్పైసెస్ బోర్డు కార్యాలయంలో తాత్కాలికంగా పసుపు బోర్డు కార్యాలయాన్ని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అర్వింద్, బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి సహా జాతీయ స్పైసెస్ బోర్డు కార్యదర్శి పి హేమలత, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల జాయింట్ సెక్రటరీ కెనంగ్ యంగ్జోమ్ హాజరు కానున్నారు.

■ జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా పల్లె గంగారెడ్డి నియామకం నేపథ్యంలో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపైంది. మనదంతా బీజేపీ కుటుంబం.. మోదీ కుటుంబం అంటూ నినాదాలు చేస్తున్నారు. సుగంధ ద్రవ్యాల బోర్డు కింద ఉన్న పసుపు పంటను విడదీసి ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేస్తుండడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర తెలంగాణకు అంతర్జాతీయ ఖ్యాతి దక్కనుందని అంటున్నారు. గుంటూరులోని పొగాకు బోర్డు, కేరళ రాష్ట్రం కొచ్చిలోని సుగంధ ద్రవ్యాల బోర్డు మాదిరిగా ఇందూరు పసుపు బోర్డుకు ప్రాధాన్యం దక్కనుందని చెబుతున్నారు. చైర్మన్‌గా పల్లె గంగారెడ్డిని నియమించిన కేంద్ర ప్రభుత్వం డైరెక్టర్లుగా ఐదుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులు, రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ట్రేడర్లను నియమించేందుకు కసరత్తు చేస్తోంది. వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమల శాఖలు, ఆయుష్, ఫార్మాసూటికల్స్ విభాగాల నుంచి రొటేషన్ విధానంలో వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులను, పరిశోధనల్లో భాగస్వామ్యమయ్యే సంస్థలు, పసుపు రైతులు, ఎగుమతిదారుల ప్రతినిధులను సభ్యులుగా నియమించనున్నారు. పసుపు బోర్డు కార్యదర్శిని కేంద్ర వాణిజ్య శాఖ నియామకం చేయనుంది.

■ పసుపు బోర్డు, రీసెర్చ్ సెంటర్ ఏర్పాటైతే సాధారణంగానే జిల్లాకు పసుపు శుద్ధి కర్మాగారాలు తరలి వస్తాయి. ప్రైవేట్ స్టోరేజ్ కేంద్రాలు భారీగా ఏర్పాటవుతాయి. ఇక్కడే ప్రాసెసింగ్ యూనిట్లు వెలుస్తాయి. దీంతో పసుపు పంటకు అదనపు విలువ జోడించినట్లవుతుంది. తద్వారా నేరుగా అంతర్జాతీయ ఎగుమతులు చేసేందుకు వీలు కలుగుతుంది.

■ భారతీయ రైతులు పండించిన పసుపు పంటకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉంది. ప్రతి ఏటా రూ.1,600 కోట్ల మేర పసుపు ఎగుమతులు జరుగుతున్నాయి. అంతర్జాతీయ పసుపు వాణిజ్యంలో భారత్ వాటా ప్రస్తుతం 62 శాతం ఉంది. ఈ పసుపు ఎగుమతుల వాణిజ్యాన్ని రూ.8,400 కోట్లకు పెంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తోంది. దీనికి పసుపు బోర్డు ఎంతగానో ఉపయోగపడనుంది. బోర్డు ఏర్పాటైతే రాష్ట్రంలో ఏటేటా తగ్గుతూ వస్తున్న పసుపు పంట విస్తీర్ణం మళ్లీ పెరిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం లభిస్తుంది. బోర్డు ఏర్పాటైతే జిల్లాకు పసుపు శుద్ధి కర్మాగారాలు, కర్క్యుమిన్ యూనిట్లు, కర్క్యుమిన్ ఆయిల్ ఎక్స్‌ట్రాక్ట్ ఎగుమతి యూనిట్లు, వివిధ పసుపు ఆధారిత పరిశ్రమలు తరలివస్తాయి. అమెరికా, యూఏఈ, బంగ్లాదేశ్, మలేసియా దేశాల్లో భారత పసుపునకు డిమాండ్ ఉంది. బోర్డు ద్వారా భారతదేశం నుంచి అంతర్జాతీయ పసుపు వాణిజ్యం మరింత విస్తృతమవుతుంది.



సాక్షిలో ప్రచురితమైన కథనాలు

వంగడాల అభివృద్ధి నుంచి మార్కెటింగ్ వరకు..

జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటైతే కొత్త వంగడాల అభివృద్ధి నుంచి పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ వరకు రైతులకు లబ్ధి కలుగుతుంది. అవసరాన్ని బట్టి పసుపు బోర్డు రైతులకు విత్తనం అందించి బైబ్యాక్ ఒప్పందం సైతం చేసుకుంటారు. రైతులకు రాయితీలు పెరుగుతాయి. పసుపు తవ్వకం, ఆరబెట్టడం, ఉడకబెట్టడం, డ్రై చేయడం, పాలిష్ చేయడానికి అవసరమైన యంత్రాలను రాయితీపై అందిస్తారు. కొత్త వంగడాల అభివృద్ధితో పాటు పసుపు పంట విత్తిన తరువాత అవసరమైన సైంటిఫిక్, సాంకేతిక పద్ధతులు అవలంబించే విషయంలో సలహాలు, సూచనలు ఇస్తారు. తద్వారా కర్క్యుమిన్ శాతం, నాణ్యత, దిగుబడి పెంచేలా రైతులకు సహకారం అందుతుంది. ఇక పసుపు పంట మార్కెటింగ్ కోసం అంతర్జాతీయ కంపెనీలను తీసుకువచ్చే బాధ్యత సైతం బోర్డు తీసుకుంటుంది.

అయ్యప్ప స్వాముల రాస్తారోకో



సదాశివనగర్: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయానికి సోమవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో అయ్యప్ప మాలధారులు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో అధికారి దృష్టికి తీసుకువెళ్లగా.. ఎమ్మెల్యే పీఏ చెప్పడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశామని చెప్పారని అయ్యప్ప భక్తులు పేర్కొన్నారు. భక్తికి రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై రంజిత్.. అయ్యప్ప స్వాములతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు.

అంబరాన్నంటిన సంబురం

బీర్కూర్ మండలంలోని రైతునగర్ గ్రామంలో జన్మభూమి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులకు వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించారు. విజేతలకు బహుమతులు అందించారు.

– బాన్సువాడ



సంక్రాంతి సంబురాలలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం, కాసుల బాల్‌రాజ్



సంబురాలలో పాల్గొన్న గ్రామస్తులు



రైతునగర్‌లో షటిల్ ఆడుతున్న యువతులు



వాలీబాల్ ఆడుతున్న యువకులు

జిల్లావాసికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం



నిజామాబాద్ రూరల్: నిజామాబాద్‌కు చెందిన రమేశ్ కార్తీక్ నాయక్ తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు భాష నుంచి రమేశ్ కార్తీక్ నాయక్ తన తొలి కథల సంపుటి 'ఢావ్లో- గోర్ బంజారా కతలు' పుస్తకానికి ఈ అవార్డు దక్కింది. ఒడిషా రాష్ట్రం భువనేశ్వర్‌లోని ఉత్కల్ విశ్వవిద్యాలయంలో 2024 సంవత్సరానికి గాను సోమవారం సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ పురస్కారాన్ని అందజేశారు. జిల్లావాసికి పురస్కారం దక్కడంపై హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్, క్యాతం సంతోష్ కుమార్, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నరాల సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే కవులు పంచరెడ్డి లక్ష్మణ, డాక్టర్ కాసర్ల నరేష్ రావు, డాక్టర్ గంట్యాల ప్రసాద్, తిరుమల శ్రీనివాసార్య, డాక్టర్ ముద్దుకూరి సాయిబాబు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్య పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. నిజామాబాద్‌లోని హబీబ్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఫక్రు (40) అనే వ్యక్తి పెయింటర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అప్పుడప్పుడు ఆర్మూర్‌లోని జర్నలిస్టు కాలనీలో తన తల్లివద్దకు వచ్చిపోయేవాడు. 15రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కాగ పెర్కిట్ శివారులో ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెందిన ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

తిర్మన్‌పల్లిలో ఒకరు..

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మనోజ్ కుమార్ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన పటిబండ్ల సురేష్(45) ఉపాధి నిమిత్తం మండలంలోని తిర్మన్‌పల్లికి వచ్చి, స్థానికంగా సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రంలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెంది సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రంలో కేబుల్ వైరుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- బాల్కొండ మండలం చిట్టాపూర్ శివారులో బైక్‌ను ఢీ కొట్టిన ట్రక్కు
- మృతిచెందిన ద్విచక్ర వాహనదారుడు.. రెండుముక్కలైన శరీరం



బత్తుల శ్రీనివాస్ (ఫైల్)



ప్రమాద ఘటన స్థలం వద్ద బైక్

బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారి 44 పై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన ట్రక్కు సుమారు పది మీటర్ల వరకు మృతదేహాన్ని ఈడ్చుకుంటూ వెళ్లడంతో శరీరం రెండు ముక్కలైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ప్రకాశం జిల్లా మార్పెడు మండలం ధర్మారం గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాస్ (32) నిర్మల్ జిల్లా సోన్ మండలం బొప్పారం గ్రామంలో పదేళ్లుగా మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం బంధువులను ఆర్మూర్ వద్ద బైక్‌పై దింపి తిరిగి బొప్పారం వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన ట్రక్కు ఢీకొట్టింది. శ్రీనివాస్ బైక్‌పై నుంచి ట్రక్కు కింద పడిపోయాడు. ట్రక్కు సుమారు పది మీటర్ల వరకు అతడిని ఈడ్చుకుంటూ వెళ్లింది. దీంతో శరీరం నడుం నుంచి రెండు భాగాలుగా విడిపోయింది. అక్కడ భయానక వాతావరణం ఏర్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు నెలల క్రితం భార్య మృతి..

మృతుడు బత్తుల శ్రీనివాస్ భార్య బత్తుల ప్రమీల ఆరు నెలల క్రితం కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకుంది. ప్రస్తుతం వీరికి గల ఇద్దరు కుమార్తెలు, కుమారుడు అనాథలుగా మిగిలిపోయారు. ఇందులో చిన్న కూతురుకు మూడేళ్ల వయస్సు ఉంటుందని బంధువులు తెలిపారు.

రెండు బైకులు ఢీ: ఇద్దరికి గాయాలు

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయలైనట్లు స్థానికులు సోమవారం తెలిపారు. క్షతగాత్రుల్లో ఒకరు మండలంలోని ఎక్లాస్‌పూర్‌కు చెందిన వ్యక్తి కాగా, మరొకరు డిచ్‌పల్లికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మృతిచెందిన రెండేళ్లకు న్యాయం

- గల్ఫ్ దేశంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లావాసి మృత్యువాత
- ఘటనపై అక్కడి కోర్టులో విచారణ
- బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందజేత



చెక్కు అందజేస్తున్న యాబ్ లీగల్ సర్వీసెస్ ప్రతినిధులు

నిజామాబాద్ నాగారం: గల్ఫ్‌లో 2022లో జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లావాసి మృతిచెందగా, రెండేళ్లకు బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందింది. వివరాలు ఇలా.. నిజామాబాద్ జిల్లా జగిత్యాల గ్రామానికి చెందిన గద్దల రాజా ఉపాధి నిమిత్తం గల్ఫ్‌దేశం వెళ్లగా, 2022 డిసెంబర్ 27న షార్జాలోని ఓ రోడ్డు దాటుతుండగా పాకిస్తానీయుడి వాహనం ఢీకొట్టింది. ఘటనలో అతడు తీవ్రంగా గాయపడగా స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఘటనపై అక్కడి పోలీసులు కేసునమోదు చేయగా, కోర్టు అనధికార స్థలంలో రహదారి దాటినట్లు అభియోగం మోపి, కేసును కొట్టేసింది. దీంతో మృతుడి బంధువులు యాబ్ లీగల్ సర్వీసెస్ సీఈవో సలాం పాపినేసరిని ఆశ్రయించారు. వారు మళ్లీ కోర్టులో కేసు వేసి, వాదనలు వినిపించారు. రోడ్డు దాటుతున్న పాదదారులను పట్టించుకోకుండా వాహనం నడిపిన పాకిస్తానీ వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. వాదనల అనంతరం బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించాలని కోర్టు తీర్పునిచ్చింది. యాబ్ లీగల్ సర్వీసెస్ సీఈవో సలాం కృషి ఫలితంగా బాధిత కుటుంబానికి రూ.50లక్షల నష్టపరిహారం దక్కింది. సలాం సోమవారం నిజామాబాద్‌కు వచ్చి బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారతీయులకు గల్ఫ్ దేశాలలో యాబ్ లీగల్ సర్వీసెస్ న్యాయ సహాయంలో అండగా నిలుస్తుందన్నారు. భారతీయులకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా మా సర్వీసెస్‌ను ఆశ్రయించాలని సూచించారు. నిజామాబాద్ రావడం ఎంతో ఆనందం కలిగించిందని అన్నారు. సంస్థ సభ్యుడు షేక్ ఆల్ అజీజ్, అబ్దుల్ రావుఫ్, మునీత్ ఉన్నారు.

పేలిన కారు టైరు.. ఢీకొన్న బస్సు





ప్రమాదంలో ధ్వంసమైన కారు, ఆర్టీసీ బస్సు

- పలువురికి స్వల్ప గాయాలు

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి గ్రామ శివారులో సోమవారం మధ్యాహ్నం ఓ కారు టైరు పేలి డివైడర్‌ను ఢీకొని ఆగగా, వెనుక నుంచి వచ్చిన బస్సు కారును ఢీకొట్టింది. ఈఘటనలో పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. డిచ్‌పల్లి వైపు నుంచి నిజామాబాద్ వైపు వెళుతున్న కారు నడిపల్లి శివారులోకి రాగానే ముందు టైరు పేలింది. దీంతో పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొని, ఒక్కసారిగా వెనక్కు తిరిగి పోయింది. అదే సమయంలో కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు కారును ఢీకొట్టింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును కంట్రోల్ చేయడంతో కారులో ఉన్న ముగ్గురితో పాటు బస్సులో ఉన్న సుమారు 60 మంది ప్రయాణికులకు తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో కారు ఎక్కువగా ధ్వంసం కాగా, బస్సు ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. పలువురికి స్వల్పగాయాలు కాగా చికిత్స ని మిత్తం ఆస్పత్రికి తరలించారు. రోడ్డుపై కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తప్పించి రాకపోకలను క్రమబద్ధీకరించారు. కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయం, అయ్యప్ప ఆలయంలో గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి ప్రవేశించి హుండీలను చోరీ చేశారు. హుండీ నుంచి సుమారు రూ. 15వేల నగదు, వెండిని ఎత్తుకెళ్లినట్లు ఆలయ పూజారి కుమార్ శర్మ తెలిపారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సిద్దుల గుట్ట ఆలయ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో..



కామారెడ్డి రూరల్: మండలంలోని గర్గుల్ గ్రామంలో ఆదివారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని దుండగులు ఎల్లమ్మ గుడి తాళాలను పగలగొట్టి హుండీలోని డబ్బులను, అమ్మవారిపై ఉన్న ముక్కుపుడక, పుస్తెలు (8మాసాల బంగారం) ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని దేవునిపల్లి పోలీసులు పరిశీలించి, వివరాలు సేకరించారు. ఆలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగలను పట్టుకునే ప్రయత్నంలో ఉన్నట్లు ఎస్సై వివరించారు.

భీమ్‌గల్ పోలీసులపై వేధింపుల ఆరోపణలు

- అధికారుల ప్రోద్బలంతోనే తనపై దాడి చేశారని ఒకరు..
- కాంగ్రెస్ నేత ఒత్తిడికి లొంగి వేధిస్తున్నారంటూ మరొకరు ఫిర్యాదు



భీమ్‌గల్ పోలీస్ స్టేషన్

మోర్తాడ్(బాల్కొండ): భీమ్‌గల్ పోలీసుల తీరు వివాస్పదమైంది. ఒకేరోజు ఇద్దరు వ్యక్తులు వేరువేరుగా సీఐ, ఎస్సైలపై ఆరోపణలు చేయడం సంచలనం సృష్టించింది. ఒకరు నేరుగా విలేకరులతో మాట్లాడగా, మరొకరు సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో ట్రోల్ చేశారు. సోమవారం చోటు చేసుకున్న ఘటనల వివరాలు ఇలా..

భీమ్‌గల్‌కు చెందిన సత్తె గంగయ్య భీమ్‌గల్ సీఐ నుంచి ప్రాణహాని ఉందని ఆరోపించారు. ఆయన ప్రోద్బలంతోనే ఎనిమిది మంది వ్యక్తులు తనపై దాడికి పాల్పడి ప్రాణాపాయ స్థితిలో వదిలివేశారని వెల్లడించారు. తన కుటుంబానికి సంబంధించిన విషయంలో కొందరు వ్యక్తులు భౌతిక దాడికి పాల్పడగా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయకుండా చిన్న కేసులతో సరిపెట్టారని ఆరోపించారు. తన ప్రాణానికి ఏమైనా కీడు జరిగితే అందుకు సీఐ బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. అలాగే చేంగల్‌కు చెందిన నిఖీష్ ఎస్సైపైన, కాంగ్రెస్ మండల అధ్యక్షుడిపైనా ఆరోపణలు చేశారు. తన భార్య ఇచ్చిన ఫిర్యాదు విషయంలో పోలీసులు అతిగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మానవ హక్కుల సంఘం, పోలీసు ఉన్నతాధికారులకు తన గోడు వెల్లబోసుకుంటూ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాలలో ట్రోల్ కావడం విశేషం.

వాస్తవాలు తెలుసుకుంటాం..


భీమ్‌గల్ పోలీసులపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలు ఏమిటో తెలుసుకుంటాం. అధికారులు ఎవరైనా చట్టానికి లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. వరకట్నం కేసుకు సంబంధించి పోలీసులు ఎలా స్పందించారు, పోలీసులపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవాలు ఏమిటో తెలుసుకుని ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.

– వెంకటేశ్వర్‌రెడ్డి, ఏసీపీ, ఆర్మూర్

మద్యం తాగించి.. నగలు అపహరణ

నిజాంసాగర్(జుక్కల్): ఓ మహిళకు మద్యం తాగించి, ఆమె నగలను చోరీచేసిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నిజాంసాగర్ మండలంలోని మంగ్లూర్ గ్రామానికి చెందిన గైని లచ్చవ్వ, గైని విఠల్‌తో కలిసి కిష్టాపూర్‌లోని బంధువుల అంత్యక్రియలకు వెళ్లారు. సాయంత్రం తిరిగి సొంతూరుకు వస్తుండగా పిట్లంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి తాను బైక్‌పై మంగ్లూర్ వెళ్తున్నానని వారికి నమ్మబలికాడు. వారితోపాటు మద్యం షాపునకు వెళ్లి మద్యం కొనుగోలు చేశాడు. ఆ తర్వాత ఇద్దరిని తన బైక్‌పై ఎక్కించుకొని బయలుదేరగా, మార్గమధ్యలో ఇద్దరికి ఆగంతకుడు మద్యం తాగించాడు. వారు మత్తులోకి వెళ్లగానే లచ్చవ్వ మెడలో ఉన్న బంగారు గుండ్లు, చెవికి ఉన్న నాగు పడిగను లాక్కొని పారిపోయాడు. కొద్దిసేపటితర్వాత స్పృహలోకి వచ్చిన లచ్చవ్వ జరిగిన విషయాన్ని కుటుంబీకులకు చెప్పడంతో నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై శివకుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



రుద్రూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సఫీయా బేగం కాంట్రాక్ట్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. పాఠశాలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో శనివారం హైదరాబాద్‌లో ఉండే బంధువుల ఇంటికి వెళ్లింది. సోమవారం ఉదయం పని మనిషి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో ఇంటి యాజమానికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా 4గ్రాముల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించిన బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై సాయన్న ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

సిరికొండ: మండల కేంద్రం శివారులో పేకాడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు ఎస్సై ఎల్ రామ్ సోమవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం అందటంతో పేకాట స్థావరంపై దాడి చేసి, వారిని పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, రూ.27,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బాల్కొండ మండలంలో..

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి) శివారులోగల పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి, పేకాడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్ సోమవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,770 స్వాధీనం చేసుకొని, కేసు నమెదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మూఢ నమ్మకాలను విడనాడాలి

నిజామాబాద్ రూరల్: మూఢ నమ్మకాలను విడనాడాలని రూరల్ పీఎస్ పరిధిలోని పోలీసులు ఖానాపూర్‌లో సోమవారం కళాజాత నిర్వహించారు. గల్ఫ్ ఏజెంట్‌ల ద్వారా యువకులు మోసపోవద్దని, సంక్రాంతి సెలవుల్లో వేరే గ్రామాలకు, పుణ్యక్షేత్రాలకు, విహారయాత్రలకు వెళ్లేవారు స్థానిక పీఎస్‌లలో సమాచారం అందించాలని సూచించారు. కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు కళాజాత సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రేతపై కేసు నమోదు

కమ్మర్‌పల్లి: మండలకేంద్రంలోని ఓ దుకాణంలో చైనా మాంజాను విక్రయిస్తుండగా విక్రేత యాదగిరి అనే వ్యక్తిని పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను ఎవరైనా విక్రయించినా, కలిగి ఉన్న కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. ఎక్కడైనా చైనా మాంజా విక్రయాలు జరిగితే సమాచారం అందించాలని అన్నారు.